సాక్షి
వరంగల్
సోమవారం । 8 । జనవరి । 2024



న్యాక్ పనుల బిల్లుల చెల్లింపులో జాప్యం.. - 8లో ▸

బిల్లులు చెల్లించకపోవడంతోనే కేయూ ఉద్యోగి మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు మృతదేహంతో ఆందోళన నిర్వహించారు.



రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం - 8లో ▸

రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయమని పాట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి అన్నారు.

గరిష్టం/కనిష్టం
30^0/18^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చలితోపాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి వేళ పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో పీజీ తదితర కోర్సులకు సంబంధించిన సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు నేడు(సోమవారం)నుంచి నిర్వహించనున్నామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు. ఈనెల 8, 10, 12, 16, 18, 20 తేదీల్లో పీజీ (ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్) కోర్సుల పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.ఈ పరీక్షల నిర్వహణకు 49 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5,486 మంది విద్యార్థులు ఆయా పరీక్షలు రాయబోతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్ర వైద్య మండలి సభ్యుడిగా నరేష్‌కుమార్



ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి సభ్యుడిగా వరంగల్ ఫోర్ట్ రోడ్డుకు చెందిన డాక్టర్.నరేష్ కుమార్ ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య మండలి భవన్‌లో హెచ్‌ఆర్‌డీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహేష్ పర్యవేక్షణలో జరిగిన వైద్య మండలి ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఐదుగురు వైద్యులు బరిలో నిలవగా డాక్టర్ నరేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యులకు ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఐఎంఏ రాష్ట్ర ప్రెసిడెంట్ డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు, తాడా రాష్ట్ర అధ్యక్షుడు వద్దిరాజు రాకేష్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు అన్వర్‌మియా, వాసవీ క్లబ్ డాక్టర్స్ ప్రతినిధులకు నరేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేటి గ్రేటర్ గ్రీవెన్స్ రద్దు


వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం(నేడు) నిర్వహించే గ్రీవెన్ డే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు విధుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన ప్రకటనలో కోరారు.

108 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి




హన్మకొండ: 108 ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని యూనియన్ బాధ్యులు పప్పుల వెంకన్న, లకావత్ బాలాజీనాయక్ కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో హనుమకొండ, వరంగల్ జిల్లాల 108 ఉద్యోగుల యూనియన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలాది మంది ప్రాణాలు కాపాడుతున్న తమకు ఉద్యోగ భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి సేవలు చేసినా సరైన గుర్తింపు లేదని వారు వాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తమ సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న రెగ్యులర్ స్టాఫ్‌నర్సులకు ఇస్తున్న జీతం మాదిరి తమకు చెల్లించాలన్నారు. పీఆర్సీ అమలు చేయాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా తీర్మానం చేశారు.

జీటీఏ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు



కాసం ప్రభాకర్, అధ్యక్షుడు



తాళ్లపల్లి ప్రకాశ్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు

విద్యారణ్యపురి: గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్(జీటీఏ) సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలను చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన కాసం ప్రభాకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి ప్రకాశ్‌గౌడ్ ఎన్నికయ్యారు. కాగా రాష్ట్ర కార్యవర్గంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేరోజు బ్రహ్మచారి, గౌరవ అధ్యక్షుడిగా విశ్వనాథంగుప్తా, సంయుక్త కార్యదర్శిగా అద్దంకి బుచ్చి రాములు, కోశాధికారిగా సపావట్ నర్సింహా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సక్రునాయక్ ఎన్నికయ్యారని సంఘం నాయకులు తెలిపారు.

సైబర్ వల





విమాన టికెట్ల బుకింగ్ ఏజెన్సీ ఇస్తామని గతేడాది అక్టోబర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి నగరంలో ఉండే ఓ ప్రైవేట్ ఉద్యోగికి టెలిగ్రామ్ యాప్ ద్వారా సమాచారం వచ్చింది. పార్ట్‌టైంగా అధిక మొత్తంలో విమాన టికెట్లు బుక్ చేసి డబ్బులు సంపాదించవచ్చని అతడు చెప్పడంతో నమ్మాడు. ఆగంతకుడు చెప్పినట్లు బాధితుడు బ్యాంకు ఖాతాల్లోకి దశల వారీగా రూ.37.59 లక్షలు జమచేశాడు. అయితే ఇటీవల అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో మోసపోయానని తెలుసుకొని వరంగల్ కమిషనరేట్ పోలీసులను సంప్రదించాడు.

గీసుకొండ మండలం గరీబ్‌నగర్‌కు చెందిన వేణు అనే వ్యక్తికి ఓ సెల్ ఫోన్ నంబర్ నుంచి గతేడాది నవంబర్ 11న మీకు రూ.ఐదు లక్షల రుణం మంజూరైందని కాల్ వచ్చింది. తియ్యటి మాటలతో అది నిజమని నేరగాడు నమ్మించాడు. దీంతో అతడు చెప్పినట్లుగా విడతల వారీగా రూ.57,999 గూగుల్ పే ద్వారా పంపించాడు. అయినా అతడు రూ.ఐదు లక్షల రుణం మంజూరు కావాలంటే ఇంకా కొన్ని డబ్బులు పంపించాలని అనడంతో అనుమానం వచ్చిన వేణు 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు.'

ఈజీమనీ పేరుతో రోజురోజుకు పెరుగుతున్న నేరాలు

- తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించవచ్చని ఆగంతకుల ఎర
- బ్యాంకు నుంచి రుణం మంజూరైందంటూ కొందరికి వల
- దశల వారీగా బాధితుల నుంచి డబ్బులు కొట్టేస్తున్న నేరగాళ్లు
- సంక్రాంతి ముందుండంతో ఆన్‌లైన్ షాపింగ్‌లోనూ మోసం చేసే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారుల సూచన

ఆన్‌లైన్ షాపింగ్‌తో జాగ్రత్త..

వచ్చేది పండుగ కాలం కావడంతో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి వివిధ ప్రముఖ ఆన్‌లైన్ బిజినెస్ సంస్థలు రాయితీలు ప్రకటించే అవకాశం ఉంటుంది. కస్టమర్లను ఆకర్షించేవిధంగా వారి బిజినెస్ ఉంటుంది. అయితే ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు కూడా ఈ ప్రముఖ సంస్థల సైట్‌ను పోలినట్టుగానే రూపొందించి కస్టమర్లను ఊరించి ఖాతాలు ఖాళీ చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసే ముందు ఆ కంపెనీ ఒరిజినల్ సైటా కాదా అని ఒకటికీ రెండు సార్లు చెక్ చేసుకున్నాకే ముందుకెళ్లాలి.

సాక్షి, వరంగల్: సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడూ రూట్ మార్చుతున్నారు. ఆయా పరిస్థితులకు అనుగుణంగా ప్రజలను ఈజీమనీ ట్రాప్‌లో పడేస్తూ అందినకాడికి కనిపించకుండానే కొల్లగొడుతున్నారు. కూర్చున్న చోట నుంచి తమ బ్యాంకు ఖాతాలో నగదు నింపుకుంటున్నారు. ఆ వెంటనే ఆ డబ్బులను డ్రా చేసి విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఇదే వారిని ఇంకా సరికొత్త నేరాలవైపు వెళ్లేలా చేస్తోంది. సెల్ టవర్ల ఏర్పాటుతో భారీ లాభాలని, విమాన టికెట్ల బుకింగ్ ఏజెన్సీతో ఈజీ సంపాదన అని, గ్యాస్ ఏజెన్సీలు ఇప్పిస్తామంటూ ప్రజలతో ఆటలాడుతున్నారు. తియ్యటి మాటలతో బుట్టలో పడేసి అందినకాడికి ఊడ్చేస్తున్నారు. వ్యక్తిగత రుణం మంజూరైందంటూ, అతి తక్కువ వడ్డీనే అంటూ మొదట సెల్‌ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు వస్తున్నారు. ఆ తర్వాత నేరుగా లైన్‌లోకి వస్తుండడంతో వారు చెప్పిన మాటలు నమ్మి రుణం మంజూరు కోసం ప్రాసెసింగ్ ఫీజులతో రూ.వేలు కొట్టేస్తున్నారు. ఎస్‌బీఐ వారి యోనో యాప్‌లో కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు, లింక్‌లు పంపుతున్నారు. అప్ డేట్ చేసుకోకపోతే బ్యాంకు ఖాతా ఎక్స్ పైరీ అవుతుందంటూ ఆ లింక్‌లో వివరాలతో పాటు ఓటీపీ నమోదుచేయడంతో ఆ తర్వాత సైబర్ ఆఫెండర్స్ ఆ ఖాతాలో ఉన్న డబ్బులను మింగేస్తున్నారు. విద్యుత్ బిల్లు కట్టలేదని ఫోన్ కాల్ కట్ కాగానే బాధితుడి సెల్ ఫోన్‌కు వచ్చిన టీమ్ వీవర్ లింక్‌ను క్లిక్ చేస్తే ఆ ఫోన్ నేరగాడి ఆధీనంలోకి వెళ్లి ఆ ఖాతాలో ఉన్న నగదును మాయం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. 2021లో 153, 2022లో 631 కేసులు నమోదైతే 2023లో ఏకంగా 1095 కేసులు నమోదుకావడం చూస్తుంటే సైబర్ నేరాలు ఏ రేంజ్‌లో పెరుగుతున్నాయో తెలుస్తోంది.

ప్రజల అప్రమత్తతతోనే నేరాలకు అడ్డుకట్ట



తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని, తక్కువ వడ్డీకే రుణాలు అంటూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఉన్న డబ్బులు పోగొట్టుకోవద్దు. ప్రజల అప్రమత్తతోనే ఈ నేరాలకు అడ్డుకట్ట పడుతుంది. ఒకవేళ సైబర్ నేరం బారిన పడితే 1930 టోల్ ఫ్రీకి కాల్ చేయాలి. ఆ వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలి. నేరం జరిగిన 24 గంటల్లో ఫిర్యాదు చేస్తే నగదు రికవరీకి అవకాశం ఉంటుంది.

\- అంబర్ కిషోర్ ఝా, వరంగల్ పోలీస్ కమిషనర్

మధ్యాహ్న భోజనానికి ధరాఘాతం

- పెరిగిన నిత్యావసర సరుకుల రేట్లు
- మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.7.50
- వంట నిర్వాహకులకు చెల్లించేది రూ.5
- ఏడాదిగా బిల్లులు అందించని ప్రభుత్వం
- అప్పులు చేసి వడ్డించలేమంటున్న వంట ఏజెన్సీ మహిళలు
- జిల్లాలో 577 పాఠశాలలు.. 42,581 మంది విద్యార్థులు



సంగెం మండలం మొండ్రాయిలో మధ్యాహ్న భోజనం వండుతున్న ఏజెన్సీ మహిళలు

సంగెం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే కార్మికులు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర సరుకుల ధరలు బాగా పెరగడంతో వండి పెట్టడం కష్టంగా మారింది. కోడిగుడ్డు రేటు రెట్టింపైంది. ప్రభుత్వం నుంచి నెలనెలా బిల్లులు రాక పోవడంతో అప్పులు చేసి వండి పెట్టడం తమవల్ల కావడం లేదని వంట ఏజెన్సీల నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు.

నెలనెలా అందని గౌరవ వేతనం..

జిల్లాలోని 13 మండలాల పరిధిలో మొత్తం 577 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 42,581 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు డ్రాపౌట్స్ తగ్గించడానికి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నది. రూ.1000 చొప్పున ఏజెన్సీ నిర్వాహకులకు గౌరవ వేతనం చెల్లిస్తున్నది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రోజుకు రూ.16.84 చొప్పున, 6 నుంచి 10వ తరగతి వారికి రూ.19.44 చొప్పున ఖర్చు చేస్తున్నది. విద్యార్థులకు మెనూ ప్రకారం వారానికి మూడు రోజులు గుడ్లు అందించాల్సి ఉంటుంది. మార్కెట్‌లో గుడ్డుకు 7.50 ఉండగా ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తున్నది. దీంతో వారానికి ఒక్కో విద్యార్థి గుడ్డుపై నిర్వాహకులకు రూ 7.50 అదనపు భారం పడుతోంది. కూరగాయలు, మంచినూనె, చింతపండు, కారం తదితర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వంట నిర్వాహకులకు నిధులు ఇవ్వకపోవడంతో విద్యార్థులకు సరిగా పౌష్టికాహారం అందడం లేదనే ఆరోపణలున్నాయి. ధరలు పెరగడంతో కొన్ని పాఠశాలల్లో మెనూ సరిగా అమలు చేయడం లేదు. గుడ్డు బిల్లులు డిసెంబర్ 2022 వరకు వచ్చాయి. 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు బిల్లులు నేటికీ రాలేదు. మిగిలిన బిల్లుల్లో 9–10 తరగతుల వారికి గత ఏడాది ఆగస్టు నుంచి, 1– 8 తరగతులకు సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు రావాల్సి ఉంది. వీటికి తోడు నెలనెలా గౌరవ వేతనం రూ.1000 సైతం రావడం లేదు. ఇలా నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టడం వల్ల అప్పులు చేసి భోజనం వడ్డించి తీవ్రంగా నష్టపోతున్నామని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచుతామన్న గౌరవ వేతనం, పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోరుతున్నారు. ఈ విషయమై సంగెం ఎంఈఓ ఎస్.విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా మధ్యాహ్న భోజన బిల్లులు చేసి పంపించాం. మంజూరు కాగానే మధ్యాహ్న భోజన కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.

బంగారం కుదువ పెట్టిన..



మధ్యాహ్న భోజనం వండిపెట్టడం కోసం మెడలోని బంగారం కుదువ పెట్టి అప్పులు చేశాం. ఎన్నో ఏళ్లుగా వంట చేస్తున్నాం. జీతాలు పెంచుతారనే ఆశతో పిల్లల కోసం వంట చేసి పెడుతున్నాం. ఇలా ఏడాదిగా గుడ్ల బిల్లులు రాకపోవడంతో అప్పులు పెరిగాయి. ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

\- పెండ్లి సరోజన, ఏజెన్సీ నిర్వాకురాలు, మొండ్రాయి

బిల్లులు రావడం లేదు..



ప్రభుత్వం ఇస్తున్న ధరలకు మార్కెట్ ధరలు రెట్టింపుగా ఉన్నాయి. మార్కెట్‌లో కూరగాయల ధరలు బాగా పెరిగాయి. ధర పెంచకపోవడంతో మాకు కష్టమవుతున్నది. బిల్లులు సకాలంలో అందక ఇప్పటికే అప్పుల పాలయ్యాం. మా ఇబ్బందులు చూసి అధికారులు గౌరవ వేతనం రూ.3 వేలకు పెంచాలి. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు చేపట్టాలి.

\- వేల్పుల ఏలిషా, ఏజెన్సీ నిర్వాహకురాలు

మేడారంలో భక్తుల కోలాహలం



తల్లుల దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

- వనదేవతల దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు
- పోలీసుల బందోబస్తు



సమ్మక్క గద్దె వద్ద కిక్కిరిసిన భక్తులు



అమ్మవారి గద్దె వద్ద భక్తులకు సూచనలు చేస్తున్న ఎస్సై ఓంకార్‌యాదవ్

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో గద్దెల ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు మేడారానికి తరలివచ్చారు. జంపన్నవాగులో స్నానాలు ఆచరించిన భక్తులు అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకుని పసుపు, కుంకుమ, పూలు పండ్లు, చీరసారె, ఎత్తు బంగారం(బెల్లం), కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల వద్ద భక్తులు పూజలు చేశారు. సుమారుగా 50వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు భక్తుల రద్దీని పర్యవేక్షించారు. ఎండోమెంట్ సిబ్బంది అందుబాటులో ఉండి భక్తులకు సేవలందించారు.

గద్దెల ప్రాంగణంలో సందడి

భక్తులు వేలాదిగా తరలిరావడంతో సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద సందడి వాతావరణం నెలకొంది. గద్దెల వద్ద మొక్కులు చెల్లించేందుకు భక్తులు పోటీ పడ్డారు. మొక్కులు చెల్లించుకున్న భక్తులు అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో కాసేపు సేదతీరారు. ఉదయం నుంచి మొదలైన భక్తుల తాకిడి మధ్యాహ్నం 3గంటల వరకు కొనసాగింది. దీంతో మేడారంలో భక్తుల వాహనాలు బారులుదీరాయి. భక్తుల కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా కనిపించాయి. మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. మేడారం మహాజాతరకు ముందస్తుగా భక్తుల రద్దీతో జాతర కళ కనిపించింది.

ప్రముఖుల రాక

మేడారం సమ్మక్క–సారలమ్మను ప్రముఖులు, అధికారులు దర్శించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్ రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సినీ నిర్మాత, ఫైర్‌బ్రాండ్ బండ్ల గణేశ్ అమ్మవార్లను దర్శించుకున్నారు. వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎత్తు బంగారం మొక్కు చెల్లించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ బండ్ల గణేశ్‌కు ఘన స్వాగతం పలికారు. మానుకోట సబ్ రిజిస్ట్రార్ తస్లీమా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు.

పోలీసుల బందోబస్తు..

మేడారానికి భక్తులు వేల సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మేడారం ఐలాండ్ ప్రదేశంలో భక్తుల వాహనాలు రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ పెరగడంతో పోలీసులు రెండు క్యూలైన్ల ద్వారా భక్తుల దర్శనానికి అనుమతిచ్చారు. భక్తుల వాహనాల ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు.

'ఎలక్షన్ ఫండ్'లో ఎస్సైలు..!

తీగ లాగితే కదులుతున్న డొంక..

- ఇంటెలిజెన్స్ విచారణలో వెలుగు చూస్తున్న వాస్తవాలు
- త్వరలోనే 'ఫండ్' ఇచ్చిన వారిపై ఉన్నతాధికారులకు నివేదిక
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మళ్లీ గెలుస్తారనే ధీమానే కారణం
- ఒక్కొక్కరుగా బయట పడుతున్న వైనం
- పోలీసు గ్రూపుల్లో వైరల్ అవుతున్న 'సాక్షి' కథనం
- చర్యలకు పట్టుపడుతున్న కొత్తగా గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు


సాక్షి
ఎమ్మెల్యే అభ్యర్థులకు పోలీసుల ఫండ్!

Forwarded
Good Morning Sir,
It happened not only in Warangal commissionarate but also in Ramagundam Commissionarate.....

It is fact some of our officers ACPs/INSPrs/SIs donated money to the contested BRS candidates....

పోలీసు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్న 'సాక్షి' కథనం క్లిప్పింగ్

సాక్షి ప్రతినిధి, వరంగల్: 'తీగలాగితే డొంక కదిలిన' చందంగా 'ఎన్నికల ఫండ్' ఇచ్చిన పోలీస్ అధికారుల గుట్టు రట్టు అవుతోంది. నిన్న మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అప్పటి వరకున్న ప్రజాప్రతినిధులకు కొందరు సీఐలు, ఒక్కరిద్దరు ఏసీపీలు మాత్రమే 'ఎన్నికల ఫండ్' ఇచ్చారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ ఫిర్యాదులు కొన్నిచోట్ల నేరుగా కొందరు ఎమ్మెల్యేల నుంచే అందడంతో సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఓ వైపు ఇంటెలిజెన్స్.. మరోవైపు స్పెషల్ బ్రాంచ్ ఆరా తీస్తుండగా.. ఫండ్ ఇచ్చిన కొందరు ఎస్సైల పేర్లు కూడా వెలుగుచూస్తున్నట్లు సమాచారం.

బాధ్యులపై త్వరలోనే నివేదిక..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అప్పటివరకున్న కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎన్నికల ఫండ్ ఇచ్చిన పోలీస్ అధికారులపై చర్యలకు నివేదికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారవర్గాల్లో ఈ అంశం హాట్ టాపిక్ గా మారింది. ఎన్నికల సందర్భంగా అప్పుడున్న సర్వేలు, ప్రచారం ఆధారంగా ఎలాగైనా మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న ధీమా ఒక వైపు.. మరోవైపు పైరవీలు, ఎమ్మెల్యేల లెటర్లతో కీలక పోస్టింగులు పొందిన వారు ఏడాదిలోపే వచ్చిన ఎన్నికల తర్వాత సైతం కొనసాగాలని ఆశపడ్డారు. అయితే, మళ్లీ గెలవాలనే పట్టుదలతో బరిలోకి దిగిన కొందరు అభ్యర్థులకు కొంతమంది ఇన్‌స్పెక్టర్లు, ఒక్కరిద్దరు ఏసీపీలు రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు 'ఎలక్షన్ ఫండ్' సమకూర్చిన వైనంపై పోలీస్ అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు. కాగా, ఎన్నికల ఫలితాల తర్వాత ఊహించని రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విషయం బయటకు పొక్కింది. సొంత శాఖ వారే ఈ వ్యవహారాన్ని భూతద్దంలో పెట్టగా ఈనోట ఆనోటా కొత్తగా గెలిచిన కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చేరింది. ఎన్నికల సమయంలో ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా.. 'ఫండ్' సమకూర్చిన సదరు అధికారులపై చర్యలకు పట్టుబడుతుండడం చర్చనీయాంశం అవుతోంది.

పోలీసు గ్రూపుల్లో 'సాక్షి కథనం' వైరల్

'ఎమ్మెల్యే అభ్యర్థులకు పోలీసుల ఫండ్' శీర్షికన ఈనెల 5న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై పోలీసువర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వరంగల్ కమిషనరేట్, ఉమ్మడి వరంగల్‌తోపాటు పొరుగు జిల్లాల పోలీసు గ్రూపుల్లో 'సాక్షి' కథనం వైరల్ అవుతోంది. 'ఎస్‌హెచ్‌ఓలుగా ఉన్న ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలే కాదు.. ఎస్సైలు కూడా ఎమ్మెల్యే అభ్యర్థులకు ఫండ్ ఇచ్చారు' అంటూ పోలీస్ గ్రూపుల్లో కామెంట్ జరుగుతోంది. ఎక్కడెక్కడ.. ఎవరెవరు.. ఎవరెవరికి.. ఎంతెంత మొత్తంలో నిధులు సమకుర్చారన్న అంశాలపై కూడా పోలేసువర్గాల్లో చిట్‌చాట్ జరుగుతోంది. ఆరోపణలు ఎదుర్కుంటున్న వారు, 'ఫండ్' వ్యవహారంతో సంబంధం లేనివారు తమ సహచరులు, సన్నిహితులతో ఒకరిపై ఒకరు పరోక్ష వ్యాఖ్యలు చేసుకుంటుండడం కూడా దుమారం రేపుతోంది.

కక్షసాధింపు చర్యలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన రూ.300 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి అభివృద్ధి పనులను కొనసాగించే దమ్ము, పనులపై సమీక్ష జరిపే ధైర్యం లేదా అని ప్రశ్నించారు. నెక్కొండ మండలంలో 500 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశామని, మిగతా మండలాల్లోని మహిళలకు కూడా ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసేలా ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలన్నారు. వెనక్కిపోయిన నిధులను ఎమ్మెల్యే మళ్లీ తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధిని కొనసాగించాలన్నారు.

సంక్షేమ పథకాలను ఆపొద్దు..

సంక్షేమ పథకాలను ఆపే ప్రయత్నం చేస్తే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, నల్లా మనోహర్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణగౌడ్, రామస్వామినాయక్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బండి రమేష్, గుంటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు.. లారీ ఢీ

● ప్రయాణికులకు తప్పిన పెనుప్రమాదం

గూడూరు : మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ మూలమలుపు సెంటర్లో ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుకభాగాన్ని లారీ ఢీకొనడంతో ప్రయాణికులకు పెనుప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ మీదుగా భూపాలపల్లి డిపోకు చెందిన బస్సు గూడూరులోని ప్రధానసెంటర్లో మూలమలుపు తిరిగింది. అదే సమయంలో నర్సంపేట వైపు మీదుగా గూడూరు చేరుకున్న లారీ ఆగి ఉన్న బస్సును వెనుకభాగాన్ని తాకుతూ వెళ్లింది. లారీ ఢీకొనడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు, లారీ డ్రైవర్ల అజాగ్రత్తతో జరగడంతో ఒకరిపై ఒకరు నీది తప్పంటే నీదే తప్ప అనుకుంటూ వెళ్లిపోవడం విశేషం.

నల్లబెల్లం, పటిక పట్టివేత

● ముగ్గురిపై కేసు నమోదు

కురవి: అక్రమంగా తరలిస్తున్న 16 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పటికను ఆదివారం కురవి మండలం సూదనపల్లి–కందికొండ గ్రామాల శివారులో పట్టుకున్నట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల శివారులో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఓ ట్రాక్టర్, బైక్ అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో 16 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు. ట్రాక్టర్, బైక్‌ను సీజ్ చేసి చిన్న గూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన వల్లూరి చెన్నారెడ్డి, జగతి శ్రీను, సూదనపల్లి గ్రామానికి చెందిన బైరి వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య



పర్వతగిరి: మండలంలోని చింతనెక్కొండకు చెందిన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మృతురాలి తండ్రి గంధ్రకోటి లక్ష్మయ్య కథనం ప్రకారం... ఆరేళ్ల క్రితం స్టేషన్ నెక్కొండకు చెందిన తన చిన్న కూతురు పనికర పద్మ(28)ను పర్వతగిరి మండలం చింతనెక్కొండకు చెందిన పనికర వెంకటయ్య పెద్ద కుమారుడు రంజిత్‌కు కట్నకానుకలు ఇచ్చి వివాహం చేశానని తెలిపాడు. పెళ్లి జరిగిన నాటి నుంచి అత్తమామలు, ఆడబిడ్డ సూటిపోటి మాటలతో వేధించేవారు. ఈ నేపథ్యంలో తన కూతురుకు ఇద్దరు సంతానం కలిగినా కుటుంబ సభ్యుల వేధింపులు ఎక్కువయ్యాయని తెలిపారు. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ జరిపించినప్పటికీ కాపురం చేసేందుకు తన బిడ్డ అంగీకరించినప్పటికి అల్లుడు రంజిత్ తరచూకొడుతుండగా, అత్తా, ఆడపడుచు ఇబ్బందులకు గురి చేసేవారన్నారు. మూడు నెలల క్రితం మా ఇంటికి పండుగకు వచ్చిన సందర్భంలో అల్లుడికి రూ.50 వేలు, బిడ్డకు రూ.20వేలు ముట్ట చెప్పినప్పటికి ఆదివారం భర్త రంజిత్ కొట్టి, బూతులు తిడుతూ పురుగుల మందు తాగి చనిపోమనగా వారందరూ వ్యవసాయ పనులకు పోయిన సందర్భంలో దెబ్బలతో ఉన్న పద్మ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే క్రమంలో పద్మ మార్గమధ్యలో మృతి చెందింది. తన బిడ్డకు చావుకు కారణమైన భర్త రంజిత్, అత్తా మామ, ఆడబిడ్డ, మరిది, యారాలుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్సై వీరభద్రరావును వివరణ కోరగా ఫిర్యాదు అందిందని తెలిపారు. కేసు విషయాలను త్వరలో వెల్లడిస్తానని ఎస్సై తెలిపారు.

‘సాక్షి’ స్పెల్‌బీకి అనూహ్య స్పందన

రీజినల్ స్థాయి పరీక్షకు 150 మందికిపైగా హాజరు

ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం

కాజీపేట : విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘సాక్షి’ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రీజినల్ స్థాయి స్పెల్ బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. కాజీపేట శివారు తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన ఈ పరీక్షకు తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి 150 మందికిపైగా విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ‘సాక్షి’ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటిసారిగా రీజినల్ స్థాయి పోటీ పరీక్ష వరంగల్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్ పరంగా నాలెడ్జ్ పెరుగుతుందని చెప్పారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో ‘సాక్షి’ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా గ్రాట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ రాజమండ్రి వ్యవహరిస్తున్నారని చెప్పారు. కాగా, తమ స్కూళ్లలో కూడా ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించాలనుకుంటే ఆయా పాఠశాలల యాజమాన్యాలు 9505514424 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ‘సాక్షి’ వరంగల్ బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, టీవీ కరస్పాండెంట్ తుమ్మ శ్రీధర్‌రెడ్డి, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్‌గుప్తా, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, తాళ్లపద్మావతి ప్రిన్సిపాల్ అఫ్జల్ ఉన్నీసా, సృజన్, రాకేష్, యామిని, మహేందర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థుల మనోగతం ఇలా ఉంది..

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI | SAKSHI DIGITAL | MEDIA GROUP



సోమిడిలోని తాళ్ల పద్మావతి కళాశాలలో ‘సాక్షి’ స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

భాష సులువు అనిపిస్తోంది..



స్పెల్‌బీ ఇంగ్లిష్ పరీక్ష రాయడం వల్ల భాష సులువు అనిపిస్తోంది. ఉచ్ఛారణ బాగా వస్తోంది. పదాలు గుర్తు పెట్టుకోవడం, కొత్త పదాలు వెతకడం వల్ల ఇంగ్లిష్‌పై పట్టు సాధించొచ్చు. ‘సాక్షి’కి కృతజ్ఞతలు.

- నిహారిక శర్మ, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్, మిర్యాలగూడ

పోటీ పరీక్షలతో ఎంతో మేలు



‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ పోటీలు నాలో నూతనోత్సాహం నింపాయి. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి చక్కటి మార్గం. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలకు హాజరైతే ప్రతిభ పెరుగుతుంది.

- కె.కార్తికేయ, జయ ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్, సూర్యాపేట

ఇంగ్లిష్‌పై ఆసక్తి పెరిగింది..



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనే ఉద్దేశంతో కొత్త పదాలు నేర్చుకోవడం మొదలు పెట్టిన తరువాత ఇంగ్లిష్ భాషపై ఇంకా ఆసక్తి పెరిగింది. కొత్త పదాలు కనిపించినప్పుడు వాటి స్పెల్లింగ్ పునశ్చరణ చేసుకుంటున్నా.

- పి.అధితి, రావూస్ టెక్నో స్కూల్, కరీంనగర్

ప్రయోజనకరంగా ఉంది



మాతృభాషతో పాటు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తేనే లక్ష్యాలను చేరుకుంటాం. తరగతి పుస్తకాలతో పాటు దిన పత్రికలు చదువుతూ ఇంగ్లిష్ నేర్చుకుంటున్నా. నా ప్రయత్నానికి స్పెల్‌బీ పరీక్ష ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

- మదియా, శ్రీఅరవిందో హైస్కూల్, జనగామ

మరికొన్ని పదాలు నేర్చుకున్నా..



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్‌లో మరికొన్ని కొత్త పదాలు నేర్చుకోవడంతోపాటు ఆ పదాలు పలికే విధానం తెలుసుకున్నా. ఇప్పుడు ఎలాంటి భయం లేకుండా ఇంగ్లిష్ మాట్లాడొచ్చనే నమ్మకం పెరిగింది.

- ఎం.సాయిప్రియ, సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, కరీంనగర్

ప్రతిభను సానబెట్టేందుకు..



విద్యార్థుల్లోని ప్రతిభను సానబెట్టేందుకు, పోటీతత్వం పెంచేందుకు స్పెల్‌బీ, ఇంగ్లిష్ పరీక్షలు ఉపయుక్తంగా ఉంటాయి. విద్యార్థులకు స్పెల్లింగ్‌లో పట్టు పెరుగుతుంది. ఇలాంటి పరీక్షలు ఎంతో దోహదపడతాయి.

- బి.సాన్వి, ఒయాసిస్ హైస్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్

పిల్లలు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తున్నారు



‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ ఇంగ్లిష్ పోటీ పరీక్షలు పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. భాషపై నెలకొన్న భయాన్ని దూరం చేసేందుకు ఈ పరీక్షలు ఉన్నాయి. ఈ పోటీలకు మా కళాశాల వేదికగా మారడం సంతోషంగా ఉంది.

- తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్

ఉపాధ్యాయుల సహకారం బాగుంది..



స్పెల్‌బీ పరీక్ష రాయడం వల్ల ఉత్సాహం రెంట్టింపు అయింది. ఇంగ్లిష్‌పై నాలో ఉన్న పట్టుదలను గుర్తించిన ఉపాధ్యాయులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఫైనల్స్‌కు వెళ్తాననే నమ్మకం మరింత పెరిగింది.

- వంశిక, ఎంజేపీ, బాలికల ఉన్నత పాఠశాల, కమలాపూర్

ఏర్పాట్లు బాగున్నాయి



పిల్లలు ఇంగ్లిష్ భాషపై చక్కటి ప్రతిభ కనబర్చడం తోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచడానికి స్పెల్‌బీ ఎంతో ఉపయోగపడుతుంది. పరీక్ష ఏర్పాట్లు బాగున్నాయి. మరిన్ని పోటీ పరీక్షలు నిర్వహించాలి.

- సురేష్‌కుమార్, ఖమ్మం

మరింత పట్టు పెరిగింది..



‘సాక్షి’ ఏర్పాటు చేసిన పోటీ పరీక్షలకు హాజరుకావడం వల్ల గ్రామర్ సులభంగా నేర్చుకున్నా. ఇంగ్లిష్ భాషపై పట్టు పెరగడంతోపాటు ఎలా మాట్లాడాలనే విషయం అర్థమైంది. ఉత్సాహంగా పరీక్ష రాశా.

- రిషిత, రామన్ స్కూల్, సోమిడి

ఉపాధ్యాయుల సహకారంతో..



ఉపాధ్యాయుల సహకారంతో ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించా. ఆ తరువాత మాట్లాడడం నేర్చుకున్నా. స్పెల్‌బీ పోటీలకు హాజరవుతూ భాషపై మరింత పట్టు సాధించా.

- ఎస్.జస్వంత్, త్రివేణి స్కూల్, ఖమ్మం

శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా..



‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ స్పెల్‌బీ పోటీలకు హాజరుకావాలనే తలంపుతో శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా. ఇలాంటి పరీక్షలు రాయడం వల్ల పిల్లల్లో పోటీతత్వం అలవడుతుందనే భావనతో వచ్చాం.

- అర్చన, జనగామ

ఇంగ్లిష్‌పై భయం పోయింది



ఇంగ్లిష్‌పై నెలకొన్న భయం పోగొట్టడంలో ‘సాక్షి’ స్పెల్‌బీ పరీక్ష ఉపయోగపడింది. ఇంగ్లిష్ అంటే కష్టంకాదని, ఎంతో సులభంగా నేర్చుకోవచ్చనే భావన కలిగింది. సహ విద్యార్థులతో పోటీపడి పరీక్షకు సన్నద్ధమయ్యా.

- బి.సాయిపల్లవి, ఏకశిల పబ్లిక్ స్కూల్, జనగామ

కారును ఢీకొన్న డీసీఎం..

● ఒకరి మృతి, నలుగురికి తీవ్ర గాయాలు
● కమలాపురంలో ఘటన



మల్లయ్య మృతదేహం

మంగపేట : ఎదురుగా వస్తున్న కారును డీసీఎం ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శనివారం అర్ధరాత్రి మండలంలోని కమలాపురం అంబేద్కర్ సెంటర్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మంగపేట మండలం రామచంద్రునిపేట జీపీ పరిధిలోని సంఘంపల్లి గ్రామానికి చెందిన పుప్పాల మల్లయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి కన్నాయిగూడెం మండలం గూర్రేవుల గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్లారు. కార్యక్రమం అనంతరం కారులో స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో కమలాపురంలో మంగపేట వైపు నుంచి వస్తున్న డీసీఎం ఎదురుగా కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న పుప్పాల మల్లయ్య(60) అక్కడికక్కడే మృతి చెందగా, కుటుంబ సభ్యులు, బంధువులు పుప్పాల రాజ్యలక్ష్మి, జెట్టి పుల్లమ్మ, ఆది సుగుణమ్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. అందులో ఉన్న ఆరు నెలల చిన్నారి కారులో ఇరుక్కుంది. చిన్నారి ఏడుపు విన్న స్థానికులు వెంటనే స్పందించి కారు నుంచి క్షతగాత్రులను బయటకు తీశారు. అనంతరం స్థానిక పోలీసులు, 108కు సమాచారం అందజేశారు. ఎస్సై గోదరి రవికుమార్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్‌తెలిపారు.



డీసీఎం ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయిన కారు

న్యాక్ పనుల బిల్లుల చెల్లింపులో జాప్యం..

మనోవేదనతో కేయూ ఉద్యోగి మృతి

● మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన
● పోలీసుల మోహరింపు .. పరిస్థితి ఉద్రిక్తం



మధుసూదన్ (ఫైల్)

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో న్యాక్ పనులకు సంబంధించి(ఫ్లెక్సీలు, సైన్, నేమ్, డైరెక్షన్ బోర్డులు, ఐడీ కార్డుల తయారీ) బిల్లుల చెల్లింపుల్లో అధికారులు తీవ్ర జాప్యం చేస్తూ వచ్చారు. దీంతో కె.మధుసూదన్ (50) అనే ఉద్యోగి కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై హనుమకొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందాడు. పరిస్థితి విషమించడంతో ఈనెల 6న హైదరాబాద్ తరలించగా అక్కడ ఆదివారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని హనుమకొండలోని నివాసానికి తరలించారు. మధుసూదన్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

కేయూకు శవయాత్ర.. ఆందోళన

అధికారులు బిల్లులు చెల్లించకపోవడంతోనే మనోవేదనతో అనారోగ్యానికి గురై మధుసూదన్ మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు మృతదేహంతో కేయూ గేట్ నుంచి పరిపాలన భవనం వరకు శవయాత్ర నిర్వహించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్దిచెప్పే యత్నం చేసినా ఆందోళన నిరసన కొనసాగించారు. మధుసూదన్‌కు పనులకు సంబంధించి రూ. 21 లక్షల వరకు చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. వీసీ వచ్చి బిల్లులు చెల్లించాలని డిమాండ్‌చేశారు. దీంతో ఏసీపీ కిరణ్‌కుమార్.. వీసీ రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. ఈనెల 8న రూ.10లక్షలు చెల్లిస్తామని మిగతా వారం, పది రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించి అక్కడి నుంచి మృతదేహాన్ని పోచమ్మకుంటకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.



పరిపాలన భవనం వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబీకులు

అధికారులే కారణం..

తన భర్త మృతికి యూనివర్సిటీ అధికారులే కారణమని మధుసూదన్ భార్య కోమల తెలిపారు. న్యాక్ పనులు చేయించుకున్నాక నెలల తరబడి తిరిగినా బిల్లులు చెల్లించకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై మృతి చెందారని కన్నీరుమున్నీరయ్యారు.

కేయూ ఉద్యోగే..

మధుసూదన్ కొన్నేళ్ల క్రితం కేయూలో ఆఫీస్ సబార్డినేట్(అటెండర్) ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుతం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. అలాగే ‘భావన డిజిటల్స్’ ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. యూనివర్సిటీలో ఫ్లెక్సీలు, నేమ్‌బోర్డులు లాంటి డిజిటల్ వర్క్స్‌కు సంబంధించి ఆర్డర్ ఇస్తే చేస్తాడు. అయితే గతేడాది మేలో న్యాక్ బృందం వచ్చే ముందు వర్సిటీలోని పలుచోట్ల ఫ్లెక్సీలు, నేమ్, సైన్ బోర్డులు తదితర పనులు చేపట్టేందుకు మధుసూదన్‌కు అధికారులు అవకాశం ఇవ్వగా పూర్తిచేసి కొన్ని నెలల క్రితమే రూ. 21 లక్షల వరకు బిల్లు పెట్టినట్లు చెబుతున్నారు. అయితే అధికారులు బిల్లు చెల్లించేందుకు ఏదో ఒకకారణం చూపి జాప్యం చేస్తూ వచ్చారని తెలుస్తోంది. ఆ బిల్లును ఆడిట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యకు ఇచ్చారని, ఆడిట్ ఆఫీస్‌లో ఆ బిల్లులు ఉన్నాయని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. అయితే కిష్టయ్య ఈనెల 5న పాలవ్యాపారి వద్ద రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన విషయం విధితమే.

అంత్యక్రియలకు రూ.20వేలు అందజేత

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ మల్లారెడ్డి, వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పృథ్వీరాజ్.. మృతుడి ఇంటికి వెళ్లారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అంత్యక్రియల నిమిత్తం రూ. 20వేలు అందజేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తారని , బిల్లులు ఇప్పిస్తామని కూడా చెప్పారని సమాచారం. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు మాట్లాడుతూ బిల్లులు కోసం కాళ్లరిగేలా తిరిగినా ఇవ్వకపోవడంతోనే మధుసూదన్ మానసికంగా ఒత్తిడికి గురై మృతి చెందారని కన్నీరుమున్నీరయ్యారు. మధుసూదన్ మృతికి యూనివర్సిటీ అధికారులే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యవసరానికి రూ.3 లక్షలు చెల్లింపు

మధుసూదన్ ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్ తరలించారు. చికిత్స నిమిత్తం న్యాక్ బిల్లులు చెల్లించాలని కోరుతూ ఈనెల 6వ తేదీన రిజిస్ట్రార్ కార్యాలయంలో కోమల లేఖ అందజేసింది. దీంతో సంబంధిత అధికారులు అదే రోజు సాయంత్రం రూ. 3లక్షలు మధుసూదన్ అకౌంట్‌లో జమచేశారని సమాచారం. అది కూడా మెడికల్ లోన్‌గా అందజేసినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడి మృతి



వెంగళ్‌రావు (ఫైల్)

కొడకండ్ల/పాలకుర్తి టౌన్ : రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని రామన్నగూడెం శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుస్కూరి వెంగళ్‌రావు (48) మొండ్రాయి గ్రామంలోని తన పెద్దమ్మ ఇంట్లో జరిగిన కార్యక్రమానికి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రామన్నగూడెం గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు సాయిచరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. కాగా, వెంగళ్‌రావు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. వెంగళ్‌రావు కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు.

అగ్రంపహాడ్‌ను సందర్శించిన ఎండోమెంట్ అధికారులు

ఆత్మకూరు: మండల పరిధి అగ్రంపహాడ్‌లోని శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంతాన్ని ఆదివారం దేవాదాయ శాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు, అసిస్టెంట్ కమిషనర్ సునీత సందర్శించారు. అమ్మవార్లను దర్శించుకున్న తర్వాత వారు మాట్లాడుతూ జాతరను విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఈఓ శేషగిరి, పూజారులకు సూచించారు.



జాతరలో గద్దెల వద్ద ఆర్‌జేసీ రామకృష్ణారావు, ఏసీ సునీత

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



రాజబాబు (ఫైల్)

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గడ్డిగానిపల్లి గ్రామంలో అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిగానిపల్లికి చెందిన జడల రాజబాబు (32) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాజబా బు అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమె ఇంట్లోనే ఉరివేసుకొని చనిపోయినట్లు తెలిపారు. మృతుడు వివాహితుడు. మృతుడి తండ్రి రాయమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయం

● పట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి

మడికొండ: రెడ్డి సంక్షేమ సంఘం సేవలు అభినందనీయమని పట్నా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లింగాల నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం కాజీపేట మండలం మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం అనంతరం నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డితోపాటు వరంగల్ పశ్చిమ, పరకాల, పాలకుర్తి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మామిడాల యశస్వినిరెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వరంగల్ జిల్లారెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం సామాజిక సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటూ రెడ్డి జాతి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. సంఘం కార్యదర్శి మేరుగు హనుమారెడ్డి, కోశాధికారి చాడ సునీల్‌రెడ్డి నివేదిక సమర్పించారు. కార్యవర్గ సభ్యులు కుందూరు కరుణాకర్‌రెడ్డి, ముద్దసాని పద్మనాభరెడ్డి, కాసర్ల వసుంధర, చందుపట్ల సత్యనారాయణరెడ్డి, లెక్కల రజినీకాంత్‌రెడ్డి, పూర్వ అధ్యక్షులు డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, కాసర్ల జనార్దన్‌రెడ్డి, తుమ్మల తిరుమల్‌రెడ్డి, పింగిలి సంపత్‌రెడ్డి, వరదారెడ్డి, సీతారా మ్‌రెడ్డి, కేయూ మాజీ వీసీ వంగాల గోపాల్‌రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు కటంగూరు రాంగోపాల్‌రెడ్డి, న్యాలకొండ భాస్కర్‌రావు, కట్కూరి దేవేందర్‌రెడ్డి, పింగిళి సంజీవరెడ్డి, కన్నారెడ్డి, వీరారెడ్డి, సుధీర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



న్యూ ఇయర్ డైరీ ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

దిడ్డి నరేందర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు

ఖిలా వరంగల్: కులం పేరుతో దూషించిన ఎక్సైజ్ శాఖ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ దిడ్డి నరేందర్‌పై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ గౌడ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ 39వ డివిజన్ శాంతినగర్‌కు చెందిన పులిచేరి సమ్మయ్య శాకరాసికుంటలోని 2వేల గజాల భూమిని 2012 సంవత్సరంలో పెరకవాడకు చెందిన దిడ్డి నరేందర్‌కు విక్రయించారు. ఆదివారం ఉదయం పులిచేరు సమ్మయ్య తాను విక్రయించిన భూమికి సంబంధించిన డబ్బులు రూ.10 లక్షలు ఇవ్వాలని అడగబోతే దిడ్డి నరేందర్ కులం పేరుతో తిట్టాడు. దీంతో బాధితుడు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దిడ్డి నరేందర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ గౌడ్ తెలిపారు.